

కథా కౌముది

బాధ్యత

శ్రావణి జెన్నాభట్ల

అలారం మోగక ముందే మెలకువ వచ్చింది.. లేవాల్సిన టైం ఎలాగో అయింది కదా అని లేచి పాల ప్యాకెట్ల కోసం కిందకి వెళ్ళింది. ఎప్పుడూ తీసుకునే దానికన్నా రెండు ప్యాకెట్లు ఎక్స్ట్రా తీసుకుంది. ఆ రెండు ఎక్స్ట్రా ప్యాకెట్లు తీసుకొని వెళ్లి ఎదురింటి వాళ్ళ తలుపు కొట్టింది. ఆ ఇంటి ఆవిడ తలుపు తెరిచింది.

"అనురాధ నువ్వా? ఎందుకమ్మా ఇంత పొద్దున్నే వచ్చావు?"

"అది పాల ప్యాకెట్లు ఇచ్చి వెళ్దామని.. అంకుల్ కి ఇప్పుడు ఎలా ఉందండి? రాత్రి నిద్ర పట్టిందా కాస్తయినా?" అని విచారమైన గొంతుతో అడిగింది అనురాధ.

"ఆ..పర్వాలేదమ్మ. కానీ నాకే నిద్ర పట్టలేదు. మధ్యలో లేచి మందులు అవి ఇవ్వాల్సి వచ్చింది దాంతోటి..."

"ఒక్కసారి అంకుల్ ని చూడొచ్చా?" అంటూ ఎంతో ఆప్యాయంగా అడిగింది.

"భలే దానివే అడగాలా? లోపలికి రా" అంటూ ఆమెను లోపలిదాకా తీసుకొచ్చింది శాంత.

"మిమ్మల్ని పలకరించడానికి అనురాధ వచ్చిందండీ" అంది శాంత రాఘవేంద్ర తో.

"ఎలా ఉన్నారు అంకుల్? నవీన్ చెప్పాడు రాత్రి డిస్చార్జ్ అయ్యేప్పుడు మీరు ఇబ్బంది పడ్డారని?"

"కొంచం ఇబ్బంది అయింది. ఇదిగో ఈ నీరసం వల్ల" అంటూ నెమ్మదిగా మాట్లాడుతున్నాడు రాఘవేంద్ర.

"అవును మరి నీరసం ఉండదా. బైపాస్ సర్జరీ అంటే మాటలు కాదు కదా!" అంటూ ఓ తండ్రి తో మాట్లాడుతున్నటువంటి ఆప్యాయతతో మాట్లాడుతోంది.

"సరే సరే మీరు విశ్రాంతి తీసుకోండి. నేను మళ్ళీ వచ్చి కలుస్తాను. అంకుల్ ని జాగ్రత్తగా చూసుకోండి ఆంటీ" అంటూ ఒక కూతురిలాగా మాట్లాడి వెళ్ళింది అనురాధ. ★★★★★

"అను! అను! నా రెడ్ షర్ట్ ఇస్త్రీ చేయించమన్నా కదా? ఇంకా రాలేదా ఇస్త్రీ నుంచి?" అంటూ తన కబోర్డ్ లో వెతుకుతూ అడుగుతున్నాడు నవీన్.

"అవును ఇస్త్రీ వాడు ఇంకా తీసుకురాలేదు. ఇవాల్టికి వేరే ఏదైనా వేసుకో. ఇప్పుడే ఎదురింటికి వెళ్లి అంకుల్ని చూసి వచ్చాను ఇంకా నీరసంగానే ఉన్నారు".

"ఇంటికి వచ్చేశారు కదా నిదానంగా కోలుకుంటారులే. నాకు ఆఫీస్ కి టైం అవుతుంది త్వరగా టిఫిన్ పెట్టు" అంటూ వేరే చొక్కా వేసుకొని హాల్ లోకి వెళ్ళాడు.

"ఇంతకీ అమృత వెళ్లిందా స్కూల్ కి?" అంటూ గబగబా టిఫిన్ తింటున్నాడు నవీన్.

"వెళ్ళింది".

"సరే నేను కూడా ఒకసారి అంకుల్ని పలకరించి ఆఫీస్ కి బయలుదేరుతా" అంటూ టిఫిన్ ప్లేటు పక్కన పెట్టి ఎదురింటికి వెళ్ళాడు నవీన్.

★★★★★

"ఆంటీ మీరేమీ కంగారు పడకండి. ఏం అవసరం వచ్చినా మమ్మల్ని అడగండి. అంకుల్ త్వరలోనే కోలుకుంటారు" అంటూ శాంతకి ధైర్యం చెప్తున్నాడు నవీన్.

"అలాగే బాబు. అయినా రేపు మా పెద్దమ్మాయి శ్రీజ వచ్చేస్తుంది. అది వెళ్లిన రిజిస్ట్రేషన్ పని పూర్తయిపోయింది. ఎలాగో పెళ్లి కూడా దగ్గర పడుతోంది కదా. ఇక నిదానంగా ఆ పెళ్లి పనులు కూడా మొదలుపెడదాం అనుకుంటున్నాం. అలాగే మా రెండో అమ్మాయి సారిక కూడా అమెరికా నుండి బయలుదేరుతోంది".

"ఓహో ! ఇంకేం అయితే అంకుల్ లేచి పరిగెత్తరూ!" అంటూ వాళ్ళని కొంచెం నవ్వించే ప్రయత్నం చేశాడు నవీన్.

★★★★★

శాంత చెప్పినట్టుగానే వాళ్ళ పెద్దమ్మాయి శ్రీజ ఇంటికి వచ్చింది. నాలుగు రోజుల తర్వాత పెళ్లి పనులు మొదలు పెట్టారు. తండ్రిని ఇంట్లోనే విశ్రాంతి తీసుకోనిచ్చి తల్లి కూతుర్లు ఇద్దరు షాపింగులు ఆ పని ఈ పని అంటూ తిరుగుతున్నారు. నవీన్, అనురాధలు కూడా కొన్ని పనుల్లో సహాయం చేస్తున్నారు.

ఇంట్లో పెళ్లి వాతావరణం మొదలవడంతో కొంత కోలుకున్నాడు రాఘవేంద్ర. లేచి కొంచెం అటు ఇటు తిరగ గలుగుతున్నాడు.

వాళ్ళు ఉంటున్నది సింగిల్ బెడ్ రూమ్ అయ్యేసరికి పెళ్లికి చుట్టాలు, వాళ్ళు వీళ్ళు వస్తారన్న ఉద్దేశంతో నవీన్ వాళ్ళ పక్కన ఇల్లుని అద్దకు తీసుకున్నారు శాంత వాళ్ళు.

"ఆంటీ ఇదిగోండి శ్రీజ బ్లౌజులు. నేను బజారుకు వెళ్తే దారిలో టైలర్ కనిపించి ఇచ్చింది" అంటూ అనురాధ లోపలికి వచ్చింది.

"థాంక్స్ అనురాధ. అన్నట్టు నిన్న రాత్రి సారిక వచ్చింది. రా మాట్లాడుదువు గాని" అంటూ సారిక దగ్గరకి తీసుకు వెళ్ళింది శాంత.

"సారిక! ఈమె అనురాధ అని..."

"ఆ.. గుర్తున్నారమ్మా. హలో అండి! ఎలా ఉన్నారు? చాలా థాంక్స్. నాన్న విషయంలో మీ హస్బెండ్ చాలా హెల్ప్ చేశారు" మొహమాటంగా మాట్లాడుతోంది సారిక.

"అఫ్కోర్స్ అండి. ఇబ్బంది వచ్చినప్పుడు ఆ మాత్రం సహాయం చేయలేమా".

"జర్నీ బానే జరిగిందా ఇంకా అక్కడ మీ జాబ్ అంతా బాగానే ఉందా?"

"యా. ఎవ్రీథింగ్ ఈస్ కూల్" అంటూ స్టైల్ గా సమాధానం ఇస్తోంది సారిక.

"సరే మళ్లీ కలుస్తాను" అంటూ వెళ్లిపోయింది అనురాధ.

సారిక మూడేళ్లు తర్వాత అమెరికా నుండి వచ్చేసరికి ఇక్కడున్న ఆమె స్నేహితులందరితో సరదాగా గడుపుతుంది. ఆమె మాట్లాడే తీరు ఆమె తెలివితేటలు ఎంతగానో ఆకట్టుకున్నాయి అనురాధని.

★★★★★

మర్నాడు పొద్దున బాల్కనీలోని వాషింగ్ మెషిన్ లో బట్టలు వేస్తోంది అనురాధ. ఇంతలో ఆమెకు పక్క ఇంటి నుంచి పెద్దగా నవ్వులు, మాటలు వినబడుతున్నాయి. వాటితో పాటు సిగరెట్, మందు వాసన కూడా వస్తోంది.

"సారిక వాళ్ళ స్నేహితులు వచ్చారు కదా ఇందాక" అంటూ మనసులో అనుకుంది అనురాధ.

ఆమెకెందుకో అనుమానంగా అనిపించింది. కొంత సేపయ్యాక ఫ్రంట్ డోర్ పీప్ హోల్ లోంచి చూసింది. సారిక ఇంకా ఆమె స్నేహితులు ఎదురు గుమ్మం దగ్గర నిలబడి మాట్లాడుకుంటున్నారు. ఇద్దరు మగవాళ్లు, ముగ్గురు ఆడవాళ్లు ఉన్నారు ఆ స్నేహితుల గ్రూప్లో. వాళ్ల వైఖరి ఏమంత సవ్యంగా అనిపించట్లేదు అనురాధకి.

★★★★★

"త్వరగా అన్నం పెట్టు ఆకలేస్తోంది. అమ్మ నిద్రపోయిందా?" అంటూ వచ్చి డైనింగ్ టేబుల్ దగ్గర కూర్చున్నాడు నవీన్.

"ఆ..అన్నం తినేసి పడుకుంది" ఏదో ముభావంగా సమాధానము ఇచ్చింది అనురాధ.

"ఏమైంది అలా ఉన్నావు?

"అది ఈరోజు మన పక్కింట్లో సారిక ని కలవడానికి వాళ్ళ స్నేహితులు వచ్చారు. పెద్ద పెద్దగా నవ్వులు వినిపించాయి. అంతేకాక సిగరెట్, మందు వాసన కూడా వచ్చింది. ఆంటీ వాళ్లు ఇంట్లో కూడా లేనప్పుడు ఇలా... అంటే ఈ రోజుల్లో ఇవన్నీ మామూలే కావచ్చు కానీ..."

భోజనం చేస్తున్న నవీన్ తినడం ఆపేసి ఆమె వైపు చూశాడు.

"చూడు నేను పెళ్లి చేసుకోవాలనుకుంటున్న అని చెప్పినప్పుడు మనకంటూ ఒక పెద్ద దిక్కులేరని వాళ్లని అడగంగానే పెద్దరికంతో ముందుకు వచ్చి మన పెళ్లి చేశారు. అప్పటినుండి మనం కొన్ని ఏళ్లుగా వాళ్లతో మంచి నైబర్హుడ్ రిలేషన్ మెయింటైన్ చేస్తూ ఉన్నాం. ఏదో అవసరం వస్తే అప్పుడప్పుడు సహాయం చేస్తూ ఉన్నాం. అంతేకానీ వాళ్లకి మనకి ఎటువంటి రిలేషన్షిప్ లేదు. సో వాళ్ల విషయాల్లో మనం వీలైనంత ఇన్వాల్వ్ అవ్వకుండా ఉంటే మనకే మంచిది" అంటూ సూటిగా చెప్పేసాడు.

"నువ్వు చెప్పింది కరెక్టే కానీ చూస్తూ చూస్తూ వాళ్ళ అమ్మాయి అలా చేయి జారిపోతుంటే వాళ్లకి చెప్పకుండా ఎలా ఊరుకోగలం?"

"నేను చెప్పేది విను. ఈ విషయం ఇంతటితోనే మర్చిపోతే మంచిది" అంటూ చేయి కడుక్కోవడానికి వెళ్ళిపోయాడు.

★★★★★

తరచుగా సారిక స్నేహితులు ఆమెను కలవడానికి వస్తునే ఉన్నారు. ఈ విషయాన్ని అనురాధ గమనిస్తూనే ఉంది.

"ఆంటీ! నవీన్ మీరు చెప్పినట్టే పూలదండలు ఆర్డర్ ఇచ్చేసాడు" శాంత ఇంట్లోకి వచ్చింది అనురాధ.

"హమ్మయ్య ఆ పని కూడా అయిపోయిందా. ఇంకా ఏమి పనులు మిగులి ఉన్నాయో ఒకసారి లిస్టు చూడాలి" అంటూ ఫోన్ తీసింది శాంత.

"ఇప్పుడు శ్రీజ పెళ్లి జరిగిపోతుంది. సో నెక్స్ట్ ఇయర్ సారిక పెళ్లే గా?"

"సర్లే అది ఇప్పట్లో పెళ్లి చేసుకోనని కచ్చితంగా చెప్పింది. ఈ రోజుల్లో పిల్లల గురించి తెలియనిదేముందమ్మా చెప్పు. మన మాట వింటారా?"

శాంత అన్నమాట అనురాధ మనసులో గుచ్చుకున్నట్టుగా అనిపించింది.

"చెప్తూనే ఉన్నాము కానీ అది వినిపించుకుంటే గా"

"అంటే ఇలా చెప్తున్నాను అనుకోవద్దు. మొన్న మీ అమ్మాయి తన స్నేహితులతో చాలాసేపు మా పక్కింట్లో గడపడం గమనించాను. అందులో తప్పేం లేదు కానీ సిగరెట్టు, మందు వాసనలు కూడా వచ్చాయి" అంటూ ఉన్నపరంగా చెప్పేసింది అనురాధ.

"తన స్నేహితులు కలవడానికి వస్తారన్న విషయం నాకు ముందుగానే చెప్పింది సారిక. నువ్వు చెప్పిన అలవాట్లన్నీ వాళ్లకు ఉన్నాయేమో గాని దీనికైతే అట్లాంటివి ఏమీ లేవు". చాలా నమ్మకంగా చెప్తోంది శాంత.

★★★★★

మర్నాడు సారిక అనురాధ వాళ్ళ ఇంటికి స్క్రూ డ్రైవర్ కోసం వచ్చింది.

"ఇదిగో తీసుకో. ఇంతకీ నువ్వెప్పుడూ చేసుకోవాలనుకుంటున్నావు పెళ్లి?" అంటూ మొదలు పెట్టింది అనురాధ.

"నేనా? సారీ".

"అదేంటి అసలు పెళ్లే ఇష్టం లేదా?"

"చూడండి నా పర్సనల్ లైఫ్ గురించి వేరే వాళ్ళతో డిస్కస్ చేయడం నాకు నచ్చదు. పనుంది ఇంక వెళ్తాను" అని అక్కడ నుండి వెళ్ళిపోయింది.

ఆమె యాటిట్యూడ్ కి ఆశ్చర్యపోయింది అనురాధ.

★★★★★

నవీన్ ఆఫీస్ నుండి వస్తూ కార్ పార్క్ చేసి లిఫ్ట్ దగ్గరికి వచ్చాడు. అదే టైంలో బయట నుంచి వస్తున్న రాఘవేంద్ర కూడా లిఫ్ట్ దగ్గరికి వచ్చాడు.

"నవీన్ నీతో కొంచెం మాట్లాడాలి" సీరియస్ గా ఉంది రాఘవేంద్ర గొంతు.

"అది... ఈరోజు పొద్దున మీ ఆవిడ మా చిన్నమ్మాయి సారికతో పెళ్లి గురించి మాట్లాడటానికి ట్రై చేసిందట. అలాగే శాంతతో కూడా అమ్మాయి గురించి ఏదేదో మాట్లాడిందట..."

వెంటనే విషయం అర్థమైంది నవీన్ కి.

"అది... తన ఏదో..." అంటూ సర్ది చెప్పబోయాడు.

"ఎన్నో ఏళ్లుగా మంచి నైబర్స్ కదా అన్న చనువుతో ఇలా అన్ని విషయాల్లో చొరవ తీసుకోవడం అంత మంచి విషయం కాదు. ఒకప్పుడు మేము నీకేదో సహాయం చేశాము. నాకు బాగో లేనప్పుడు నువ్వు నీకు తోచినంత సహాయం చేశావు. అది ఎంతవరకో అంతవరకే ఉంటే బాగుంటుంది" శాంతంగానే వస్తోంది అతని మాట.

"సారీ అంకుల్. ఇంకెప్పుడూ ఇలా జరగదు. తనకి నేను చెప్తాను. వన్స్ అగైన్ సో సారీ" అంటూ నవీన్ లిఫ్ట్ ఎక్కకుండా మెట్లు ఎక్కి వెళ్ళిపోయాడు.

★★★★★

"నీకు ఎంత చెప్పాను. వాళ్ళ అమ్మాయిల పర్సనల్ విషయంలో నువ్వు ఇన్వాల్వ్ అవ్వద్దు అని" అంటూ కోపంగా లోపలికి వచ్చి అరుస్తున్నాడు భార్య మీద.

"నేను ఎక్కువగా ఏమి మాట్లాడలేదు. జస్ట్ ఏదో...".

"మాట్లాడొద్దు. చేసినదంతా చాలు. ఇంకొక్కసారి వాళ్ల విషయాల్లో ఇన్వాల్వ్ అయినట్టు తెలిసింది అంటే ఊరుకొను" అంటూ కోపంగా రూమ్ లోకి వెళ్లిపోయాడు నవీన్.

ఆ రోజు నుంచి వాళ్ల విషయాల్లో జాగ్రత్తగా ఉంటోంది అనురాధ. వాళ్ల పెద్దమ్మాయి పెళ్లి చాలా ఘనంగా జరిగింది. నవీన్ వాళ్లు కూడా వాళ్లకి కుదిరినంత సహాయం చేశారు పెళ్లిలో.

పెళ్లి హడావిడి అంతా అయ్యాక వాళ్ళ చిన్నమ్మాయి సారిక తిరిగి అమెరికా కి వెళ్ళిపోయింది.

★★★★★

అలా ఒక ఎడాది గడిచింది. నవీన్ ని ఆఫీస్ వాళ్లు అమెరికాకు పంపాలని నిర్ణయించుకున్నారు. ఇక్కడ ఉంటున్న ఇల్లుని ఖాళీ చేసి వెళ్లడానికి కావాల్సిన ఏర్పాట్లు అన్ని చూసుకుంటున్నారు భార్యాభర్తలిద్దరూ.

ఎప్పటి లాగానే పొద్దునే కిందకు వెళ్లి పాల ప్యాకెట్లు తెచ్చుకుని తన ఇంట్లోకి వెళ్ళబోయింది అనురాధ. ఎదురింటి వాళ్ల తలుపు కొంచంగా తెరిచి ఉంది. హాల్లో నుంచి శాంత ఏడుస్తున్న శబ్దం వినబడుతోంది.

ఏమై ఉంటుందా అని వెళ్లి అడుగుదామా అనుకుంది అనురాధ. కానీ వాళ్ళ విషయాల్లో ఇన్వాల్వ్ అవ్వద్దు అని నవీన్ చెప్పిన మాటలు గుర్తొచ్చి ఆగిపోయింది.

పక్కింటి హేమ గారిని కనుక్కుందామని వాళ్ళ ఇంటికి వెళ్ళింది.

"ఏమైందండీ? ఎదురింట్లో ఏం జరిగింది? మీకేమైనా తెలుసా?" అంటూ భయంగా మాట్లాడుతోంది అనురాధ.

"వాళ్ళ చిన్నమ్మాయి సారిక కడుపుతో ఉందట!"

"ఏమిటి మీరు అనేది?"

"పూర్తిగా వినండి. సారిక ని పెళ్లి చేసుకోమంటూ అక్కడి సంబంధమే ఏదో చూసి పంపాడట రాఘవేంద్ర. తీరా ఆ పెళ్ళికొడుకు సారిక ని కలవడానికి ఇంటికి వెళ్తే, రెండు ఏళ్ల నుంచి ఆ పిల్ల వేరే అతనితో కలిసి అదే ఇంట్లో ఉంటుందన్న విషయం తెలిసింది. వెంటనే ఆ పెళ్ళికొడుకు రాఘవేంద్ర కు ఫోన్ చేసి విషయం అంతా చెప్పాడట".
వింటున్నదంతా నిజమేనా అనిపిస్తోంది అనురాధకు.

"ఆరోజు నువ్వు వాళ్ళ అమ్మాయి గురించి ఏదో అన్నావనే గా రాఘవేంద్ర మీ ఆయనతో అలా మాట్లాడాడు. ఈరోజు అదే నిజమైంది" అంటూ చెప్పుకోస్తోంది పక్కింటి హేమ.

"మీరేమంటున్నారో అర్థం కావట్లేదు".

"వాళ్ళ అక్క పెళ్లికి వచ్చిన సారిక స్నేహితుల్లో అతను కూడా ఉన్నాడట".

ఆరోజు తన ఊహించినదంతా నిజమే అనుకుంటూ వింటోంది అనురాధ.

"గొడవలు ఎక్కువయ్యి ఇద్దరు విడిపోయారట. కానీ తర్వాత తెలిసింది ఆమె కడుపు తో ఉందని. వెంటనే తెలిసిన డాక్టర్ దగ్గరికి వెళ్లి అబార్షన్ చేయించుకుందట" ఎంతో ఆత్రుతతో చెప్తోంది హేమ.

"ఇవాళ పొద్దున్నే రాఘవేంద్ర అమ్మాయికి ఫోన్ చేసి తిడుతుంటే విన్నాను. నోరు మూసుకొని ఇక్కడికి రమ్మంటుంటే నేను రానంటే రానని తెగేసి చెప్తోంది. కనీసం ఇన్నాళ్లుగా కలిసి ఉంటున్న అతన్నే పెళ్లి చేసుకోమని అడిగితే అతనికి నాకు గొడవలు అయ్యి విడిపోయాం. ఇప్పుడు అదంతా కుదరదు అని చెప్పిందట".

★★★★★

ఇంటికి వెళ్లి జరిగిన విషయం అంతా నవీన్ కి చెప్పింది.

"ఒకసారి మనం కూడా వెళ్లి మాట్లాడి వద్దామా?" అంటూ భర్తని బ్రతిమలాడుతోంది అను.

ఆమె చెప్పినట్టే వెళ్లాలి అనిపించినా రాఘవేంద్ర అన్న మాటలు గుర్తొచ్చి "వద్దు. అవసరం లేదు. మనం రేపు రాత్రి బయలుదేరాలి గుర్తుంది కదా. సామాన్లన్ని సరిగ్గా సర్దుకున్నామో లేదో చూసుకుందాం పదా" అంటూ రూమ్ లోకి వెళ్లిపోయాడు నవీన్.

వెనకాలే వచ్చిన అనురాధ "ఇప్పుడు అమెరికాకి వెళ్లడం అవసరం అంటావా?"

"ఏం మాట్లాడుతున్నావ్? నా లైఫ్ లో ఈ ఆఫర్ కోసం నేను ఎంత ఎదురు చూశానో తెలుసా?"

"అది కాదు మన అమ్మాయి కూడా అక్కడ పెరిగితే ఆ కల్చర్ కి అలవాటు పడి..."

"నువ్వు మాట్లాడే దానికి ఏమన్నా అర్థం ఉందా. అక్కడ ఎంతోమంది చదువుకుంటున్నారు, ఉద్యోగాలు చేసుకుంటున్నారు. అందరూ సారిక లాగే ఉంటారు అనుకోవడం తప్పు. ఇంకా ఆ విషయం వదిలేసి మన పాస్పోర్ట్లు ఎక్కడ పెట్టావో చెప్పు" అంటూ బ్యాగులు వెతుకుతున్నాడు నవీన్.

★★★★★

మర్నాడు పొద్దునే ఎవరో కాలింగ్ బెల్ కొట్టిన శబ్దం. తలుపు తీసింది అనురాధ. ఎదురుకుండా శాంత.

"ఆంటీ! మీరా రండి లోపలికి రండి".

"ఈరోజు రాత్రికి మీరు అమెరికాకి బయలుదేరుతున్నారంట కదా? మాతో చెప్పనేలేదు? ఆరోజు మా వారు అలా అన్నారని నవీన్ కి కోపం వచ్చిందా?" దిగాలుగా ఉంది ఆవిడ గొంతు.

"అయ్యో అదేం లేదు ఆంటీ. ఏదో పనుల హడావిడిలో పడి..."

"సారిక గురించి...విషయం మీకు తెలిసే ఉంటుంది. అది ఇంక ఇక్కడికి వస్తుందన్న నమ్మకం అయితే లేదు. ఈరోజు కాకపోతే ఏదోరోజు పెళ్లికి ఒప్పుకుంటుంది అనుకున్నాము. ఇలా అక్కడ కల్చర్ కి అలవాటు పడిపోతుంది అనుకోలేదు" అంటూ కన్నీళ్లు పెట్టుకుంది శాంత.

"ఊరుకోండి" అంటూ పక్కకొచ్చి కూర్చుని ఓదారుస్తోంది అనురాధ.

"ఏదైతేనేం ఈ రోజుల్లో పిల్లలు ఏది అనుకుంటే అది జరగాల్సిందేగా. ఇలా బాధపడడం తప్పించి ఏం చేస్తాం చెప్పు".

తన పెళ్లి విషయంలో ఆమె తల్లిదండ్రులు కూడా ఇలాగే బాధపడి ఉంటారేమో అనిపించింది అనురాధకు.

దానికి ఇష్టమైన స్వీట్లు కొన్ని చేసి పెట్టాను. మీరు అది ఉండే స్టేట్ కే వెళ్తున్నారట కదా. అడ్రస్ ఇస్తాను. మీరు తీసుకెళ్లి ఇవ్వగలిగితే..."

"అలాగే తప్పకుండా" అంటూ ప్యాకెట్ను తీసుకుంది అనురాధ.

"జాగ్రత్తగా వెళ్ళిరండి. అమృతని జాగ్రత్తగా చూసుకోండి" అని చెప్పి వెళ్ళిపోయింది శాంత.

శాంత అన్న మాటలకు ఆమె తల్లిదండ్రులు తన పెళ్లిని అంగీకరించి ఆమెను ఇప్పటివరకు దగ్గరికి తీసుకోలేదని గుండెల్లో దాగున్న బాధ కన్నీళ్ళ రూపంలో బయటికి వచ్చింది.

వెళ్లేముందు ఒక్కసారైనా తన తల్లిదండ్రులను కలవగలిగితే బాగుంటుందని తన తల్లికి మెసేజ్ చేసింది అనురాధ. కానీ ఎటువంటి రిప్లై రాలేదు. ఎయిర్ పోర్టుకి ఎవరూ రాలేదు

★★★★★

అనుకున్నట్టుగానే అమెరికా చేరుకుని హోటల్ రూమ్ లో ఉంటూ ఇల్లు వెతుక్కునే పనిలో ఉన్నారు. సారికకు వాళ్ళ అమ్మ ఇచ్చిన స్వీట్స్ ఇద్దామని తన ఇంటికి వెళ్ళి తలుపు కొట్టగానే సారిక తలుపు తీసింది.

"హలో అండీ. ఎలా ఉన్నారు?" అని పలకరించింది సారిక.

"యా గుడ్".

"లోపలికి రండి" అని పిలిచింది సారిక.

"లేదు. వేరే పని ఉంది వెళ్ళాలి. ఆంటీ మీకోసం ఈ స్వీట్స్ పంపారు".

"ఒహ్ ఇవా! థాంక్యూ. అమ్మ వాళ్లు ఎలా ఉన్నారండి? అంటే... నాతో ఫోన్లో కూడా సరిగ్గా మాట్లాడడం లేదు" తెలుసుకోవాలన్నట్టుగా అడిగింది.

"కొంచెం ఇబ్బంది పడుతూ ఉన్నారు".

"అయ్యుండొచ్చు. మీరే చెప్పండి మీరు ఒకప్పుడు మీకు నచ్చిన అతన్ని పెళ్లి చేసుకోవడం కోసం ఇల్లు వదిలేసి వచ్చారంట కదా! ఒక 10 –12 ఏళ్ల క్రితం కాబట్టి మీకు పెళ్లి మీద మంచి ఒపీనియన్ ఉంది. పెళ్లి చేసుకున్నారు. ఈ రోజుల్లో నాకు పెళ్లి మీద ఒపీనియన్ లేదు కాబట్టే కుదరదు అన్నాను. ఇందులో తప్పేముంది చెప్పండి. అయినా కొన్ని రోజులైతే వాళ్లే సెట్ అవుతారు. అందుకే అప్పటిదాకా ఫోన్ కూడా చేయకూడదు అనుకుంటున్నా" అని క్యాజువల్ గా తీసి పడేసినట్టు మాట్లాడింది సారిక.

తల్లిదండ్రుల విషయంలో ఆమె ప్రవర్తన నచ్చని అనురాధ వెంటనే...

"నేనైతే ఒకటే చెప్తాను. నాకు నచ్చిన వాడిని పెళ్లి చేసుకోవడం కోసం ఒకప్పుడు మా ఇంట్లో పెద్ద యుద్ధమే చేశాను. వాళ్ళు కుదరదు అనేసరికి ఇల్లు వదిలేసి అయితే వచ్చాశాను కానీ వాళ్లతోటి బంధాన్నయితే తెంపుకోలేదు. వాళ్ళు నాతో మాట్లాడడం మానేశారు కానీ నేను వాళ్లతో మాట్లాడడానికి చేసే ప్రయత్నాలు అయితే మానలేదు".

"ఎంత అడ్వాన్స్డ్ ప్రపంచంలో బ్రతుకుతున్న, ఎంత ఫ్రీడమ్ దొరుకుతున్న తల్లిదండ్రుల అవసరం ఇంకా నాకేముందలే అనుకునేంత క్యాజువల్ మెంటాలిటీ అయితే నాకు లేదు". అనురాధ మాటలు కొంచెం గట్టిగా తగిలినట్టుగానే అనిపించాయి సారికకు.

"వాళ్ల అవసరం ఇప్పుడు మనకి లేకపోయినా మన తోడు ఇప్పుడు వాళ్ళకి అవసరం అనుకునే రకం నేను. అంతేకాదు వాళ్ళని జాగ్రత్తగా చూసుకోవాల్సిన బాధ్యత నాది అని గట్టిగా నమ్మే మనస్తత్వం నాది. అందుకే నా ప్రయత్నాలని నేను ఆపలేదు ఆపను కూడా. నీకు ఇంకొకళ్ళు చెప్పే సలహాలు నచ్చవని తెలుసు కానీ కుదిరితే ఒకసారి నేను చెప్పిన విషయం గురించి ఆలోచించు. ఉంటాను" అని అక్కడి నుండి బయలుదేరిపోయింది అనురాధ.

★★★★★

"ఈ రోజుల్లో పిల్లల్ని చూస్తుంటే ముందు ముందు జనరేషన్ ఎలా తయారవుతుందో, ఎట్లాంటివి చూడాల్సి వస్తుందో అని భయమేస్తోంది" అంటూ డ్రైవ్ చేస్తున్న నవీన్ తో మాట్లాడుతోంది.

"ఆంటీ ఆ రోజు "పిల్లలు మన మాట వింటారా!" అన్నప్పుడు తల్లిదండ్రుల్ని బాధ పెట్టిన విషయంలో సారికకు నాకు తేడా ఏముందని అనుకున్నాను. కానీ ఇప్పుడు ఈ అమ్మాయి తో మాట్లాడిన తర్వాత అర్థమైంది. ఒకప్పుడు ఇల్లు వదిలేసి వచ్చిన మాట నిజమే కానీ ఏ రోజూ నా బాధ్యతని నేను మర్చిపోలేదు. వాళ్లతో మాట్లాడడానికి ఇదివరకటి

లాంటి బంధం ఏర్పరచుకోవడానికి నా ప్రయత్నాలు నేను చేస్తూనే ఉన్నాను. కానీ ఈ పిల్ల ఆంటీ వాళ్లు సరిగ్గా మాట్లాడడం లేదని ఫోన్ చేయడమే మానేసిందట" కోపంతో పెద్దగా వస్తోంది ఆమె మాట..

ఆమెను శాంతపరచాలన్న ఉద్దేశంతో నవీన్...

"అయినా ఒకప్పుడు మీ అమ్మానాన్నలు ఏదో అన్నారని ఫీల్ అయ్యావు అంటే అర్థం ఉంది. వీళ్లు జస్ట్ మన నైబర్స్. అంతకుమించి వాళ్ళకి మనకి ఎటువంటి రిలేషన్ లేదు. ఇదివరకూ చెప్పాను, ఇప్పుడు మళ్లీ చెప్తున్నాను వాళ్ల మాటల్ని, వాళ్ళ విషయాల్ని లైట్ తీసుకో".

అతను చెప్పిన విషయాన్ని వింటూనే ఫోన్ లో చూస్తోంది. తన తల్లి నుండి లేటుగా వచ్చిన రిప్లై "వెళ్ళే ముందు ఒక్కసారి ఇంటికి వచ్చి వెళ్లుండాల్సింది. మీ నాన్న కూడా ఇలానే అనుకున్నారు" అని.

ఇన్ని ఏళ్ల తర్వాత ఆమెను ఇంటికి రమ్మనేసరికి ఒక్కసారిగా మనసులో ఉన్న బాధ తీరిపోయినట్టుగా అనిపించినా వెంటనే వెళ్లేంత దగ్గరలో లేమే అన్న దూరం ఆమె కళ్ళల్లోంచి కన్నీళ్లను తెప్పించింది.

★★★★★

COMMENTS